RNI.No.APTEL/2023/90038

నేటి కాలం

తెలుగు దినపత్రిక

సంపుటి : 03 సంచిక : 261 ఎడిటర్ : గనగల్ల రామారావు విజయనగరం, శనివారం 07 నవంబర్ 2026 వెల : 2 రూ/ పేజీలు : 4

నేటి కాలం
తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ తెలుగు రాష్ట్రాలలో జిల్లాల వారీగా, మండలాల వారీగా విలేఖరిగా పనిచేయడానికి అనుభవం కలిగిన లేక కొత్తగా ఆసక్తి కలిగిన వారు
సంప్రదించండి
సెల్ : 95813 47358

తుఫానుల నష్టాన్ని అంచనా వేస్తున్నాం

ప్రతి రైతునూ ఆదుకుంటాం





మంచి దిగుబడితో పంట చేతికొచ్చి ఆనందంగా ఉన్న సమయంలో మురసు తుపాను రైతుల ఆశలను నీరుగార్చిందని సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటను తుపాను దెబ్బతీయడం అత్యంత బాధాకరమని, నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన, గుంటూరు జిల్లా రేటూరు వద్ద రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలను వారికి వివరించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "అర్నబ్, మురసు తుపానుల వల్ల రాష్ట్రానికి, ముఖ్యంగా రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ఎల్ నినో ప్రభావంతో రైతులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటుంటే, పట్టిసీమ ద్వారా నీరందించి పంటలు సాగు చేసుకునేలా ప్రోత్సహించాం. మంచి దిగుబడితో పంట చేతికందే సమయంలో మురసు తుపాను రైతులను కోలుకోలేని దెబ్బతీసింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై తుపాను ప్రభావం తీవ్రంగా ఉందని తెలిపారు.ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలతో నష్టాన్ని చాలా వరకు నివారించగలిగామని సీఎం స్పష్టం చేశారు. "తుపానులపై ముందస్తు హెచ్చరికలు జారీ చేసినప్పుడు ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దు. ముందస్తు జాగ్రత్తల వల్లే ప్రాణనష్టాన్ని నివారించి, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగాం" అని విజ్ఞప్తి చేశారు. తుపాను సహాయక చర్యల కోసం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా సాయం తీసుకుంటున్నామని వివరించారు. అర్నబ్ తుపాను వల్ల నేలకొరిగిన 30 వేల విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించామని, మురసు తుపాను వల్ల దెబ్బతిన్న మరో 10 వేల స్తంభాలను కూడా యుద్ధప్రాతిపదికన సరిచేస్తున్నామని తెలిపారు. ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు.తుపానుల వల్ల జరిగిన నష్టంపై పూర్తిస్థాయిలో అంచనాలు వేస్తున్నామని, దీనిపై ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి సమాచారం అందిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఫోన్ చేసి తుపానుల ప్రభావంపై ఆరా తీశారని వెల్లడించారు. నష్టపోయిన రైతులకు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా పెట్టుబడిని తిరిగి అందిస్తామని హామీ ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చివరి వ్యక్తికి సాయం అందే వరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే పనిచేస్తారని స్పష్టం చేశారు. నల్లమడ డ్రెయిన్‌కు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామన్నారు.ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన విమర్శలు చేశారు. "గత పాలనలో తుపానులు వస్తే రెడ్ కార్పెట్ వేయించుకుని పర్యటనలు చేసి పరామర్శించారు. కానీ మేము ఎన్నికల కంటే ప్రజా సమస్యలకే ప్రాధాన్యత ఇచ్చి క్షేత్రస్థాయిలో పనిచేశాం. కొందరు ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడమే పనిగా పెట్టుకున్నారు. పరిషత్ ఎన్నికల ఫలితాలు వచ్చాక అన్ని విషయాలూ మాట్లాడతా" అని అన్నారు. తీర ప్రాంతాలను తుపానులు దెబ్బతీస్తుంటే, రాయలసీమను ఎల్ నినో ఇబ్బంది పెడుతోందని, అందుకే రాష్ట్రంలో నీటి భద్రత, సమర్థ నీటి నిర్వహణకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని చంద్రబాబు వివరించారు.

భారత్ అమ్ములపొదిలో

మరో అస్త్రం..

'ప్రళయ్' పరీక్ష సక్సెస్



భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే 'ప్రళయ్' క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలో గురువారం ఉదయం 11:10 గంటలకు ఈ ప్రయోగాన్ని నిర్వహించినట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధికారికంగా ప్రకటించారు.ఈ ప్రయోగంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "వినియోగదారుల మూల్యాంకన పరీక్షల్లో భాగంగా ఈ ప్రయోగం జరిగింది. నిర్దేశించిన అన్ని లక్ష్యాలను ఇది విజయవంతంగా పూర్తి చేసింది. వివిధ రేంజ్ సాధనాల ద్వారా సేకరించిన డేటా ఈ విషయాన్ని ధ్రువీకరించింది" అని ఆయన తెలిపారు. స్వదేశీ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఈ విజయం మరో ముఖ్యమైన మైలురాయి అని ఆయన పేర్కొన్నారు.డీఆర్‌డీవో గత నెలలో కూడా మరో ఘనతను సొంతం చేసుకుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన హై-ఆల్టిట్యూడ్ ప్లాట్‌ఫామ్ సిస్టమ్ (హెచ్‌ఏపీఎస్) విమాన ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు ప్రకటించింది. ఈ ప్రయోగంలో భాగంగా హెచ్‌ఏపీఎస్ 21 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుని, సుదీర్ఘ సమయం పాటు స్ట్రాటోస్ఫియర్‌లో ప్రయాణించే సామర్థ్యాన్ని ప్రదర్శించింది.రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ప్రయోగాత్మక విమానం సముద్ర మట్టానికి 21 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుంది. ఆ తర్వాత సుమారు 20 కిలోమీటర్ల ఎత్తులో 30 నిమిషాలకు పైగా నిలకడగా ప్రయాణించింది. నిరంతర నిఘా, కమ్యూనికేషన్లు, పర్యవేక్షణ వంటి కార్యకలాపాలకు స్ట్రాటోస్ఫియర్ ఎంతో అనుకూలమైన ప్రాంతం కాగా, ఆ ఎత్తులో పనిచేసే సామర్థ్యాన్ని ఈ వ్యవస్థ నిరూపించింది. ప్రయోగ సమయంలో ఎయిర్‌బోర్న్ ప్లాట్‌ఫామ్ నుంచి గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌కు రియల్ టైమ్ వీడియో, వాహన పనితీరు డేటా నిరంతరం ప్రసారమైంది.ఈ వ్యవస్థలో ఇనర్షియల్ మెజర్‌మెంట్ యూనిట్, జీపీఎస్ రిసీవర్, ఆన్‌బోర్డ్ కెమెరాలు, ఎత్తును నియంత్రించే యంత్రాంగాలు వంటి అనేక పరికరాలను అమర్చారు. ఈ ఉప వ్యవస్థలన్నీ మిషన్ అంతటా సక్రమంగా పనిచేశాయని అధికారులు తెలిపారు. భారత వైమానిక దళం, సెంటర్ ఫర్ మిలిటరీ ఎయిర్‌వర్తీనెస్ అండ్ సర్టిఫికేషన్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వంటి పలు ఏజెన్సీల సమన్వయంతో ఈ ప్రయోగాన్ని నిర్వహించారు.

నేడే ఏపీలో జడ్పీటీసీ,ఎంపీటీసీ

ఎన్నికల కౌంటింగ్

తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ (పరిషత్) ఎన్నికల ఓట్ల లెక్కింపు శనివారం (నవంబర్ 7) ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఇందుకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లనూ పూర్తి చేసింది. ఏకగ్రీవాలు పోగా సుమారు 7,767 ఎంపీటీసీ, 582 జడ్పీటీసీ స్థానాలకు ఓట్ల లెక్కింపు జరగనుంది.

70.72 శాతం పోలింగ్

నవంబర్ 5న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బ్యాలెట్ పేపర్ల ద్వారా పోలింగ్ జరిగింది. ఎంపీటీసీ ఎన్నికలకు గులాబీ రంగు, జడ్పీటీసీ ఎన్నికలకు తెలుపు రంగు బ్యాలెట్ పేపర్లను ఉపయోగించారు.

వర్షాలు, వరదల కారణంగా 5 మండలాల్లో, సాంకేతిక సమస్యల వల్ల మరికొన్ని చోట్ల రీపోలింగ్ అవసరమైంది. ఇది నవంబర్ 6న ప్రశాంతంగా ముగిసిందని అధికారులు తెలిపారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన తుది గణాంకాల ప్రకారం మొత్తం పోలింగ్ శాతం 70.72గా నమోదైంది. విశాఖపట్నం జిల్లా ప్రాంతాల్లో అత్యధికంగా సుమారు 82.51 శాతం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యల్పంగా సుమారు 62.01 శాతం పోలింగ్ జరిగింది. ఇతర జిల్లాల్లో శ్రీకాకుళం 65.51, అనకాపల్లి 75.58, చిత్తూరు 76.30, కృష్ణా 73.21 శాతంగా నమోదైంది.

కౌంటింగ్ ఏర్పాట్లు

28 జిల్లాల్లో 365 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 9,000కు పైగా టేబుళ్లు సిద్ధం చేశారు. 30 వేల నుంచి 40 వేల మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటారు. వీరిలో 11 వేలకు పైగా సూపర్‌వైజర్లు ఉన్నారు. కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు, 144 సెక్షన్ అమలులో ఉంటుంది. భారీ భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రాలకు తరలిస్తున్నారు.

లెక్కింపు ప్రక్రియ, ఫలితాల సమయం



ఉదయం 8 గంటలకు ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. ఆ తర్వాత అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులు తెరుస్తారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్లను వేరు చేసి చేతితో లెక్కిస్తారు కాబట్టి ఎక్కువ సమయం పడుతుంది.

తొలి అధికారిక ట్రెండ్స్ సుమారు 4 గంటల తర్వాత, అంటే మధ్యాహ్నం లేదా ఆ తర్వాత వెలువడే అవకాశం ఉంది. ఎంపీటీసీ ఫలితాలు మధ్యాహ్నం 3 గంటల సమయానికి, జడ్పీటీసీ ఫలితాలు సాయంత్రం 7 గంటల సమయానికి వస్తాయని అంచనా. ఒక్కో స్థానం లెక్కింపు పూర్తయ్యే కొద్దీ ఫలితాలు రాత్రి వరకు కొనసాగే అవకాశం ఉంది.

జిల్లాలు, మండలాల వారీ ఫలితాలను రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ంవఎ.ఖజూ.స్త్రశీజ.అఅ తో పాటు తెలుగు మీడియా ద్వారా తెలుసుకోవచ్చు.

దీపావళి కానుకలతోనూ కాలుష్యం పెరుగుతోంది..

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుతున్న వేళ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దీపావళి సందర్భంగా కానుకలు ఇచ్చిపుచ్చుకునే సంప్రదాయం కూడా వాహన కాలుష్యానికి కారణమవుతోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. ఏటా కాలుష్య సమస్యను ఎదుర్కొంటున్న ఢిల్లీలో పరిస్థితులు మారాలంటే ప్రజల ఆలోచనా విధానం, జీవనశైలిలో మార్పు రావాలని సూచించారు. ముఖ్యంగా సంపన్నులు దీపావళి కానుకల సంప్రదాయాన్ని సామాజిక హోదా, ప్రతిష్ఠకు చిహ్నంగా మార్చేశారని వ్యాఖ్యానించారు.

ఢిల్లీ కాలుష్యంపై శుక్రవారం విచారణ సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. కానుకలు ఇచ్చిపుచ్చుకునే సంస్కృతి వల్ల వాహనాల రాకపోకలు పెరిగి కాలుష్యం ఎక్కువవుతోందని పేర్కొన్నారు. మన అసలైన సంప్రదాయం ఏమిటో, ఏ పద్ధతులు పాటించాలో ప్రజలు గుర్తించాలని అన్నారు. దీపావళి కానుకల పంపిణీని తగ్గించడం కూడా కాలుష్య నియంత్రణకు అవసరమైన సాంస్కృతిక మార్పుల్లో భాగమని అభిప్రాయపడ్డారు.

మరోవైపు ఢిల్లీలో గాలి నాణ్యత మరింత దిగజారింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) గణాంకాల ప్రకారం శుక్రవారం నగర సగటు గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 389గా నమోదైంది. పలు ప్రాంతాల్లో ఇది 400 దాటింది. దీంతో గాలి నాణ్యత తీవ్ర కేటగిరీకి చేరువైంది. దీపావళి నవంబర్ 8న జరగనున్న నేపథ్యంలో మార్కెట్లు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోతున్నాయి. పండుగ కానుకల కొనుగోళ్లు, పంపిణీతో వాహనాల రద్దీ పెరుగుతోందని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.

ఢిల్లీలోకి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వాహనాలు వస్తుండటంతో వాటి కాలుష్య ఉద్గారాలను పర్యవేక్షించడం కష్టమవుతోందని సీజేఐ పేర్కొన్నారు. ఒక వాహనం కేవలం రెండు గంటల పాటు నగరంలో తిరిగినా కాలుష్యానికి కారణమవుతుందని అన్నారు. వాహనాల సంఖ్య మాత్రమే కాకుండా అవి రోడ్లపై ఎంతసేపు తిరుగుతున్నాయన్నది కూడా ముఖ్యమని స్పష్టం చేశారు.

కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు కోర్టుకు తెలిపారు. ఇప్పటికే గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) రెండో దశ అమల్లో ఉందని, రోడ్లపై నీళ్లు చల్లడం, సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం చేయడం వంటి చర్యలు చేపట్టినట్లు వివరించారు. కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాల (పీయూసీ) పరీక్షలు ఎక్కడ నిర్వహిస్తున్నారో గుర్తించేలా జియోట్యాగింగ్ చేస్తున్నామని చెప్పారు.



వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డాక్టర్ ఎ. కృష్ణ ప్రసాద్

నేటి కాలం – విజయనగరం: జిల్లాలోని గంట్యాడ మండలంలోని ఎం.జె.పి.ఏ.పి.బి.సి.డబ్ల్యూ.ఆర్. బాలికల పాఠశాల ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఎ. కృష్ణ ప్రసాద్ గారు ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, వసతి గృహాల పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, భోజన నాణ్యత, ఆహార మెనూ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యలు, విద్యా సంబంధిత అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా మరియు సంక్షేమ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వసతి గృహాల్లో మెరుగైన వాతావరణం కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఎదురైతే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, అవసరమైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలియజేశారు.

విద్యార్థుల హక్కులు, సంక్షేమం మరియు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా డాక్టర్ ఎ. కృష్ణ ప్రసాద్ గారు పేర్కొన్నారు.



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్



నేటి కాలం – విజయనగరం: జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ శుక్రవారం పరిశీలించారు. కొత్తవలస, వేపాడ, ఎస్.కోట, ఎల్.కోట మండలాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఎస్.కోట మండలం బొడ్డవరలోని డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ సందర్శించి కౌంటింగ్ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని, ఎన్నికల కమిషన్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కౌంటింగ్ సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి జైలు, జరిమాన

- మహిళా పీఎస్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు ఈ.నరసింహ మూర్తి

నేటి కాలం – విజయనగరం:
వరకట్న వేధింపులకు పాల్పడిన నిందితుడు జీ.పట్టాభి చంద్రశేఖర్ కు జే ఎఫ్ సి ఎం స్పెషల్ మొబైల్ కోర్టు ఒక సం. సాధారణ జైలుశిక్ష, రూ.500 జరిమాన విధిస్తూ నవంబరు 6న తీర్పు వెల్లడించారని మహిళా పీఎస్ ఇన్స్పెక్టర్ ఈ.నర్సింహమూర్తి తెలిపారు.

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ

- కౌంటింగ్ నిబంధనలు, పారదర్శకతపై అధికారులకు కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆదేశాలు

నేటి కాలం – విజయనగరం: జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు, కౌంటింగ్ విధివిధానాలు, సిబ్బంది బాధ్యతలపై శుక్రవారం వెబెక్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...

– కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేని వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదు.
– కౌంటింగ్ కేంద్రాల లోపలికి ఎలాంటి ద్రవ పదార్థాలను తీసుకురాకూడదు.
– ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు, సిబ్బంది విధులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి.
– రీకౌంటింగ్ కోరే అభ్యర్థుల అభ్యర్థనలను నిబంధనల ప్రకారం 15 నిమిషాల వ్యవధిలోనే స్వీకరించాలి.
– ప్రతి హాల్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు కోసం నిర్దేశించిన విధంగా కౌంటింగ్ టేబుళ్లు, సిబ్బంది ఏర్పాట్లు చేయాలి.
– పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.
– కౌంటింగ్ ఏజెంట్లకు నిర్ణీత సమయానికి అనుమతి కల్పించి, కౌంటింగ్ హాళ్లలోకి ప్రవేశించే విధానాన్ని క్రమబద్ధీకరించాలి.
– పోస్టల్ బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం తెరిచి, వాటి లెక్కింపు చేపట్టాలి.
– ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపును నిబంధనల ప్రకారం సమాంతరంగా నిర్వహించాలి.
– రీకౌంటింగ్ అనేది చెల్లుబాటు అయ్యే ఓట్లకు మాత్రమే సంబంధించి ఉంటుంది. చెల్లని ఓట్లను కూడా కలిపి రీకౌంటింగ్ చేయరాదు.
– చెల్లుబాటు అయ్యే, చెల్లని ఓట్లపై సందేహాలు తలెత్తినప్పుడు రిటర్నింగ్ అధికారి నిబంధనల ప్రకారం తుది నిర్ణయం తీసుకోవాలి. సందేహాస్పద ఓట్లకు టావులేదు.
– కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి, అధికారికంగా ధ్రువీకరించిన నివేదికలను అందించాలి.
– పోస్ట్ లో అందిన సర్వీస్ ఓట్ల వివరాలను అభ్యర్థులకు నిబంధనల ప్రకారం తెలియజేయాలి.

ఈ సూచనలన్నింటినీ అధికారులు, కౌంటింగ్ సిబ్బంది తప్పనిసరిగా పాటిస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వెబెక్స్ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్, డీఆర్ఓ సిహెచ్. సత్తిబాబు, జిల్లా పరిషత్ సీఈఓ కిరణ్ కుమార్, డిప్యూటీ సీఈఓ లవరాజు, ఆర్డీఓలు, డీఎల్‌డీఓలు, రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



దళిత ఉద్యమనేత బసవకు నివాళులు



నేటి కాలం – విజయనగరం:
దళిత ఉద్యమనేత, ప్రజా హక్కుల పోరాట యోధులు కీ.శే.లు బసవ సూర్యనారాయణ గారి పార్థివ దేహాన్ని విజయనగరం జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ విజయనగరం పట్టణం కనపాకలోని ఆయన స్వగృహం నందు నవంబరు 6న సందర్శించి, పార్థివ దేహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. కీ.శే.లు బసవ సూర్యనారాయణ కుటుంబ సభ్యులతో జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ కాసేపు మాట్లాడి, వారికి ధైర్యం చెప్పి, కీ.శే.లు బసవ సూర్యనారాయణతో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు కీ.శే.లు బసవ సూర్యనారాయణ అండగా నిలబడి, వారికి నిస్వార్థంగా సేవలందించే వారని ఆయన సేవలను జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ కొనియాడి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బసవ సూర్యనారాయణ మరణం దళిత వర్గానికి తీరని లోటని డివిఎంసి సభ్యులు పి.చిట్టిబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో డివిఎంసి సభ్యులు పి.చిట్టిబాబు, డీ బి ఎస్ యూ రాష్ట్ర కార్యదర్శి కే.సిహెచ్.బంగారాజు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు ఎం.చంద్రరావు, నక్కా సూరప్పడు, బి.అప్పన్న, డీ దబ్ల్యూ ఎఫ్ జిల్లా కార్యదర్శి కోరుకొండ వరలక్ష్మి, తదితరులు పాల్గొని, సూర్యనారాయణకి శ్రద్ధాంజలి ఘటించారు.

పరిషత్ ఓట్ల లెక్కింపు నేడే

- శనివారం ఉదయం 8 నుంచి ప్రారంభం- ఏడు నియోజకవర్గాల్లోని 36 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు

నేటి కాలం – విజయనగరం:

జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం మరియు పోలీసు శాఖ సమగ్ర ప్రణాళికతో పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేశాయి. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. రాంసుందర్ రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కౌంటింగ్ నిర్వహణకు సిద్ధమైంది. నవంబర్ 7న జరగనున్న ఈ ఓట్ల లెక్కింపు కోసం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 27 మండలాలకు సంబంధించి వేర్వేరు ప్రాంతాల్లో 36 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 27 జెడ్పీటీసీ స్థానాలతో పాటు 438 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు జరగనుంది.

నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ కేంద్రాలు & గదుల వివరాలు:-

బొబ్బిలి నియోజకవర్గం (ప్రభాకర్ స్కూల్, బొబ్బిలి):
బాడంగి మండలం: దక్షిణ బ్లాక్‌లోని 2వ తరగతి గదిలో జెడ్పీటీసీ, 4వ తరగతి గదిలో ఎంపీటీసీ లెక్కింపు.
బొబ్బిలి మండలం: వెస్ట్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్ ఆఫీస్ రూమ్‌లో ఎంపీటీసీ, 5వ తరగతి గదిలో జెడ్పీటీసీ లెక్కింపు.
రామభద్రపురం మండలం: మొదటి అంతస్తులోని 6వ తరగతి గదిలో ఎంపీటీసీ, 7వ తరగతి గదిలో జెడ్పీటీసీ లెక్కింపు.
తెర్లాం మండలం: ప్రభాకర్ స్కూల్ వెస్ట్ సైడ్ మొదటి అంతస్తులోని 3వ భవనం.

చీపురుపల్లి నియోజకవర్గం (ఎస్‌డీఎస్ ఆర్ట్స్ అండ్ అప్లైడ్ సైన్స్ కళాశాల, గరివిడి):
చీపురుపల్లి: 108వ గది.
గరివిడి: 201వ గది.
గుర్ల: 105, 106 గదులు.
మెరకముడిదాం: 101, 102 గదులు.

గజపతినగరం నియోజకవర్గం:
బొండపల్లి: విజయనగరం జేఎన్టీయూ కళాశాల గ్రౌండ్ ఫ్లోర్‌లోని 26వ గది.
దత్తిరాజేరు: గజపతినగరం జెడ్పీ ఉన్నత పాఠశాల మొదటి అంతస్తు.
గజపతినగరం: పురిటిపెంట ప్రభుత్వ జూనియర్ కళాశాల తూర్పు వైపు గ్రౌండ్ ఫ్లోర్‌లోని 1, 2 గదులు.
గంట్యాడ: విజయనగరం జేఎన్టీయూ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ 2వ అంతస్తు డ్రాయింగ్ హాల్.
మెంటాడ: గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల సౌత్ బ్లాక్‌లోని 3, 4 గదులు.

నెల్లిమర్ల నియోజకవర్గం:
భోగాపురం: జొన్నాడ లెండి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 4వ అంతస్తులోని జేసీ బోస్ హాల్.
డెంకాడ: జొన్నాడ లెండి ఇన్‌స్టిట్యూట్ (షిరిడీ సాయి బ్లాక్) 4వ అంతస్తు సౌత్ వింగ్.
నెల్లిమర్ల: లెండి కళాశాల (షిరిడీ సాయి బ్లాక్) 1వ అంతస్తు సిఎస్ ఈ ఎల్ హెచ్ 5 గది.
పూసపాటిరేగ: లెండి కళాశాల అడ్మిన్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్ శ్రీనివాస రామానుజన్ కాన్ఫరెన్స్ హాల్.

రాజాం నియోజకవర్గం (జీఎంఆర్ వరలక్ష్మి డీఏవీ పబ్లిక్ స్కూల్, రాజాం):
రాజాం: 41వ గదిలో ఎంపీటీసీ, 40వ గదిలో జెడ్పీటీసీ లెక్కింపు.
రేగిడి ఆమదాలవలస: 37, 38 గదులు.
సంతకవిటి: 30వ గదిలో జెడ్పీటీసీ, 31వ గదిలో ఎంపీటీసీ లెక్కింపు.
వంగర: 24, 25 గదులు.

శృంగవరపుకోట నియోజకవర్గం:
జామి: విజయనగరం జేఎన్టీయూ అకడమిక్ బ్లాక్-2 (2వ అంతస్తు) ఈసీఈ విభాగం ఎల్ హెచ్-40 గది.
కొత్తవలస: ఎస్.కోట డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ 9బి తరగతి గది.
ఎల్.కోట: డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ 10వ తరగతి గది.
ఎస్.కోట: డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ సెమినార్ హాల్.
వేపాడ: డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ (1వ అంతస్తు) 4వ తరగతి బి గది.

విజయనగరం మండలం:
విజయనగరం జేఎన్టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అకడమిక్ బ్లాక్-2 (1వ అంతస్తు) ఎడమవైపు ఎల్ హెచ్-35 గది.

భారీ పోలీసు భద్రత బందోబస్తు:

కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తును రంగంలోకి దించింది. భద్రతా బలగాలు: 7 మంది డీఎస్పీలు, 37 మంది సీఐలు, 64 మంది ఎస్ఐలు, 104 మంది కానిస్టేబుళ్లు, మరియు 452 మంది ఇతర పోలీసు సిబ్బందిని నియమించారు.
కౌంటింగ్ కేంద్రాల పరిధిలోని సంబంధిత పోలీసు స్టేషన్ల ద్వారా మూడంచెల భద్రతా చర్యలు చేపడుతున్నారు.
అధికారులు మరియు సిబ్బంది సమన్వయంతో శనివారం ఉదయం నుంచే బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయి.



ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత

- జిల్లా కలక్టరు ఎస్.రాంసుందరరెడ్డి

నేటి కాలం – విజయనగరం: ప్రజల నుంచి స్వీకరించే ప్రజా సమస్యల అర్జీలను వేగవంతంగా, పారదర్శకంగా, నాణ్యతతో పరిష్కరించేందుకు పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో నూతన విధానాన్ని తప్పనిసరిగా అమలుచేసి పాటించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని, ప్రతి అర్జీకి సముచితమైన పరిష్కారం చూపడంతో పాటు, అర్జీదారులకు స్పష్టమైన సమాచారం అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ పరిష్కారానికి నూతన విధానంపై జరిగిన సమావేశంలో జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖలకు అందిన అర్జీలు, వాటి పరిష్కార పురోగతి, పెండింగ్ దరఖాస్తులు, తిరిగి తెరవబడిన అర్జీలు, పరిష్కారంలో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలను కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా పీజీఆర్ఎస్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అనుసరించాల్సిన నూతన విధానాలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

రెండేళ్ల ఐదు నెలల్లో 74,521 అర్జీలు

2024 జూన్ 15 నుంచి ఇప్పటివరకు సుమారు రెండేళ్ల ఐదు నెలల కాలంలో జిల్లాలో మొత్తం 74,521 ప్రజా సమస్యల అర్జీలు అందినట్లు కలెక్టర్ తెలిపారు. వీటిలో రెవెన్యూ, సర్వే శాఖలకు సంబంధించి సుమారు 47 వేల అర్జీలు రావడం గమనార్హమన్నారు. మిగిలిన అర్జీలు పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, ఇంజినీరింగ్, వ్యవసాయం, పౌరసరఫరాల తదితర శాఖలకు సంబంధించినవిగా ఉన్నాయని పేర్కొన్నారు. సుమారు 90 శాతం అర్జీలు ఈ ప్రధాన శాఖల పరిధిలోనే ఉన్నందున ఆయా శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కార ప్రక్రియను మెరుగుపరచాలని సూచించారు. జిల్లాలో అందిన ఫిర్యాదులలో 97.07శాతం ఫిర్యాదులను విజయవంతంగా పరిష్కరించడం జరిగింది. పరిష్కరించిన వాటిలో 97.25శాతం కేసులు నిర్దేశిత గడువులోపు పూర్తి చేయబడ్డాయి. రెవెన్యూ సర్వే అండ్ ల్యాండ్ రికార్డు శాఖలకే అత్యధికంగా 47,969 ఫిర్యాదులు (మొత్తం జిల్లా ఫిర్యాదులలో దాదాపు 64శాతం) అందాయి. రెవెన్యూ శాఖలో 34,211 ఫిర్యాదులు రాగా, 1,288 పెండింగ్‌లో ఉన్నాయి (పరిష్కార రేటు 96.12%). సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో 13,758 అందగా, 199 పెండింగ్‌లో ఉన్నాయి (పరిష్కార రేటు 98.53%). పంచాయితీ రాజ్ శాఖలో 3,046 ఫిర్యాదులు రాగా, 296 పెండింగ్‌లో ఉన్నాయి (పరిష్కార రేటు 90.18%, ఇది ప్రధాన శాఖలలో తక్కువ.

ప్రతి శాఖకు స్పష్టమైన ఎస్ ఓ పీ , దశలవారీ వర్క్‌ఫ్లో

పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో మానవ జోక్యాన్ని తగ్గించి, పారదర్శకతను పెంపొందించేందుకు ఆటోమేషన్ విధానాన్ని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి శాఖ తమ పరిధిలోని అర్జీల స్వీకరణ, పరిశీలన, క్షేత్రస్థాయి విచారణ, అర్హత నిర్ధారణ, ఆమోదం, పరిష్కారం వంటి ప్రతి దశకు సంబంధించి స్పష్టమైన ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు. దరఖాస్తు ఏ అధికారి వద్ద ఉంది, ఏ దశలో ఉంది, తదుపరి ఎవరికి పంపాలి అనే అంశాలు వ్యవస్థలో స్పష్టంగా కనిపించేలా వర్క్‌ఫ్లో రూపొందించాలన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో అనవసర జాప్యం, పునరావృత ప్రక్రియలు, వ్యక్తిగత విచక్షణకు అవకాశం లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఒకే సమస్యపై ఒకటి కంటే ఎక్కువ అర్జీలు నమోదుకాకుండా డూప్లికేట్ దరఖాస్తులను గుర్తించే విధానాన్ని కూడా పటిష్టం చేయాలని తెలిపారు.

వాట్సాప్ ద్వారా అర్జీదారులకు ఎప్పటికప్పుడు సమాచారం

పీజీఆర్ఎస్ దరఖాస్తుల స్థితిగతులపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించేందుకు వాట్సాప్ ఆధారిత సమాచార వ్యవస్థను అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. అర్జీ స్వీకరణ నుంచి పరిశీలన, అర్హత నిర్ధారణ, ఆమోదం, తిరస్కరణ, తుది పరిష్కారం వరకు ప్రతి దశలో సంబంధిత సమాచారాన్ని అర్జీదారులకు వాట్సాప్ ద్వారా తెలియజేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా దరఖాస్తు ఆమోదించబడిందా, తిరస్కరించబడిందా, ఇంకా పరిశీలనలో ఉందా అనే వివరాలతో పాటు, తిరస్కరణకు గల కారణాలను కూడా స్పష్టంగా తెలియజేయాలని పేర్కొన్నారు. దీనివల్ల ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గడంతో పాటు, సిబ్బంది పనిభారం కూడా తగ్గుతుందని తెలిపారు.

తిరస్కరణకు ముందు సమగ్ర పరిశీలన తప్పనిసరి

పింఛన్లు, గృహ నిర్మాణాలు, ఇంటి స్థలాలు, రెవెన్యూ, సర్వే, పంచాయతీరాజ్, మున్సిపల్, పౌరసరఫరాల తదితర శాఖలకు సంబంధించిన అర్జీలను పరిశీలించేటప్పుడు అర్హత నిబంధనలను క్షుణ్ణంగా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్లతో పాటు ఇతర సంక్షేమ పథకాల దరఖాస్తుల విషయంలో పాత దరఖాస్తులు, కొత్త దరఖాస్తులు, కుటుంబాల వారీగా అందుబాటులో ఉన్న వివరాలను సమగ్రంగా పరిశీలించి అర్హతను నిర్ధారించాలన్నారు. ఆధార్ వివరాలు, కుటుంబ సభ్యుల సమాచారం, ఆదాయ వివరాలు, వాహనాల వివరాలు తదితర అంశాలను సంబంధిత ప్రభుత్వ డేటాబేస్‌లతో సరిచూసి నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. కేవలం సాంకేతిక సమాచారం ఆధారంగా తొందరపడి దరఖాస్తులను తిరస్కరించకుండా, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.



తిరస్కరించిన అర్జీలకు రీ-వెరిఫికేషన్

అర్హత లేని దరఖాస్తులను తిరస్కరించే ముందు అందుకు సంబంధించిన కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని, అర్జీదారునికి అర్థమయ్యే విధంగా సమాచారం అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. తప్పుగా తిరస్కరించబడినట్లు గుర్తించిన దరఖాస్తులను తిరిగి పరిశీలనకు పంపాలని ఆదేశించారు. అవసరమైన సందర్భాల్లో రీ-వెరిఫికేషన్ కోసం సంబంధిత ఎంపీడీఓ లేదా మున్సిపల్ కమిషనర్ కార్యాలయాలకు పంపి క్షేత్రస్థాయిలో మరోసారి విచారణ జరిపించాలని తెలిపారు. ఏ ఒక్క అర్హుడికి అన్యాయం జరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తిరస్కరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. అర్జీలను కేవలం సంఖ్యాపరంగా పరిష్కరించినట్లు చూపించడం కాకుండా, ప్రజలకు వాస్తవమైన ఉపశమనం కలిగించే విధంగా నాణ్యమైన పరిష్కారం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలంటే పీజీఆర్ఎస్ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, సాంకేతికత సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి శాఖాధికారి తమ పరిధిలోని అర్జీలను నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్ణీత సమయంలో సమగ్ర పరిష్కారం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శాఖ పరిధిలో ఉన్న అంశాలను వెంటనే పరిష్కరించాలని, . ప్రభుత్వ లేదా తదుపరి స్థాయికి సంబంధించిన పెండింగ్ వివరాలను పారదర్శకంగా పౌరులకు తెలియజేయడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు కలక్టరు దిశా నిర్దేశం చేసారు.



కొబ్బరి చిప్ప... ఎవరికి దెబ్బ?

- పూసపాటిరేగ జడ్పీటీసీలో రసవత్తర పోరు!



నేటి కాలం – పూసపాటిరేగ:
పూసపాటిరేగ మండల జడ్పీటీసీ ఎన్నిక ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లోనే హాట్ టాపిక్ గా మారింది. గెలుపు ఎవరిది అన్న దాని కంటే, కొబ్బరి చిప్ప(కొబ్బరి కాయ) ఎవరికి దెబ్బ కొడుతుంది? అన్నదే ఇప్పుడు అందరి నోటా నానుతున్న ప్రశ్న. కూటమిలోని రెబెల్ అభ్యర్థిగా పసుపులేటి లలిత కళ బరిలోకి దిగడంతో, ఈ ఎన్నిక ఒక్కసారిగా త్రిముఖ పోరుగా మారిపోయింది.

బరిలో ఎవరెవరు?

కూటమి తరఫున జడ్పీటీసీ అభ్యర్థిగా జనసేన పార్టీ నుండి కోట్ల రేవతి బరిలో నిలిచారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి మహంతి శివ పోటీ చేస్తున్నారు. వీరిద్దరి మధ్యే ప్రధాన పోటీ . కానీ తెర మీదకు కొబ్బరి చిప్ప(కొబ్బరి కాయ)గుర్తుతో రెబెల్ అభ్యర్థి రావడంతో లెక్కలన్నీ తారుమారువుతాయా...?అనే సందిగ్ధం చోటుచేసుకుంది.

రెబెల్ వెనుక టీడీపీ నేతల అండ...?

ఆసక్తికర విషయం ఏమిటంటే, పలు ఎంపీటీసీ స్థానాల్లో రెబెల్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న టీడీపీ నేతలంతా ఇప్పుడు జడ్పీటీసీ బరిలో ఉన్న కొబ్బరి చిప్ప(కొబ్బరి కాయ)గుర్తుకు బహిరంగంగా మద్దతు పలుకుతున్నారు. టికెట్ దక్కలేదన్న అసంతృప్తితో ఉన్న ఈ నేతలు, తమ అనుచరులతో, తమ గ్రామాల్లోని ఓటు బ్యాంకుతో కొబ్బరి చిప్ప వైపు మళ్లారనే టాక్ వినిపిస్తుంది. దీంతో కొబ్బరి చిప్ప సాధారణ స్వతంత్ర అభ్యర్థి కాదు, కూటమిలోని అసంతృప్తి శక్తులన్నింటికీ ప్రతీకగా మారిందా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

7 వేల ఓట్ల వరకు గండి!

రాజకీయ విశ్లేషకుల అంచనా ప్రకారం, కొబ్బరి చిప్ప(కొబ్బరి కాయ)కారణంగా సుమారు 7 వేల ఓట్ల వరకు గండి పడే అవకాశం ఉంది. మొత్తం 49,754 ఓట్లు పోలైన మండలంలో 7 వేల ఓట్లు అంటే మామూలు విషయం కాదు. గెలుపోటములను తారుమారు చేసేంత పెద్ద సంఖ్య ఇది. ఈ ఓట్లు ఎవరి ఖాతాలో నుండి పోతాయి? అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న.

ఎవరికి దెబ్బ?

కొబ్బరి చిప్ప ఓట్ల చీలికతో ఇప్పుడు ఇరు పార్టీలు ఆందోళనలో పడ్డాయి. కానీ రాజకీయ విశ్లేషకులు మాత్రం ఈ దెబ్బ కూటమి అభ్యర్థికే ఎక్కువగా తగిలే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఎందుకంటే, కొబ్బరి చిప్పకు మద్దతు ఇస్తున్నది కూటమిలోని టీడీపీ రెబెల్ నేతలే అన్న ప్రచారం జరుగుతున్న దృష్ట్యా, వారి ఓట్లు కూటమి నుండే చీలిపోతాయనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. అదే సమయంలో వైసీపీ వర్గం కూడా "కొబ్బరి చిప్ప(కొబ్బరి కాయ)మాకు లాభం చేస్తుంది" అని సంబరపడే పరిస్థితి లేదు. ఎందుకంటే అసంతృప్త ఓటు ఎటువైపు మళ్లుతుందో చివరి నిమిషం వరకు ఎవరూ చెప్పలేరు.



చివరి నిమిషం వరకు ఉత్కంఠ!

కూటమి అభ్యర్థి గెలుపును కొబ్బరి చిప్ప(కొబ్బరి కాయ) అడ్డుకుంటుందా? లేక వైసీపీ అభ్యర్థికి పరోక్షంగా సహాయం చేస్తుందా? అన్నది తేలాలంటే నేడు జరగనున్న కౌంటింగ్ వరకు ఆగాల్సిందే. ఒక్క కొబ్బరి చిప్ప(కొబ్బరి కాయ)మండల రాజకీయాల్లో ఇంత పెద్ద భూకంపం సృష్టిస్తుందని ఎవరూ ఊహించలేదు.
ఏదేమైనా పూసపాటిరేగ జడ్పీటీసీ ఫలితం, రెబెల్ ఓట్ల చీలిక మీదే ఆధారపడి ఉంటుందా.... ? లేదా..? అనేది మరి కొన్ని గంటల్లో స్పష్టత రానుంది. కొబ్బరి చిప్ప కొడితే... దెబ్బ ఎవరికి తగులుతుందో చూడాలి..

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో తమకుఅన్యాయం జరిగిందంటూ తహసీల్దార్‌కు వినతి!

నాలుగేళ్లుగా నివాసం ఉంటున్నా గుర్తింపు లేదా?

2023 గ్రామసభ తీర్మానం ప్రకారం న్యాయం చేయాలని ఇటీకాలపల్లి గ్రామస్థుల విజ్ఞప్తి

జనగామ జిల్లా । నవంబర్ 6
బచ్చన్నపేట: మండలంలోని ఇటీకాలపల్లి గ్రామానికి చెందిన పలువురు ప్రజలు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో తమకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ శుక్రవారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా తాము ఇళ్లలో నివాసం ఉంటున్నామని, 2023లో అప్పటి ఆర్ఐ, గ్రామ కార్యదర్శి, సర్పంచ్ సమక్షంలో నిర్వహించిన గ్రామసభలో 18 మందికి ఇళ్లు కేటాయిస్తూ తీర్మానం చేశారని తెలిపారు. అయితే ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన డ్రాలో తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.గత గ్రామసభ తీర్మానం, తమ నివాస పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఇండ్ల రజిత, దయ్యాల మౌనిక, జరిపోతుల పుష్ప, గడ్డం అనిత, దండుగుల కనకరాజు, మడల్పాటి సిద్ధమ్మ, సఫియా, చేవెళ్ల అంజమ్మ, మాద భారతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీడబ్ల్యుజేఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ఎమ్మిగనూరు
ఎమ్మిగనూరు ఏపీడబ్ల్యూజేఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో ఏపీడబ్ల్యుజేఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగానిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో కేక్ కట్ వేడుకలు నిర్వహించారు అనంతరం యూనియన్ అధ్యక్షులు షబ్బీర్ గౌరాధ్యక్షులు దేవేంద్ర మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వాలకు ప్రజలకు వారదులు గా జర్నలిస్టులు ఉంటారని రాజ్యాంగంలో స్వేచ్ఛ అనేది ముందుగా జర్నలిస్టులకు వర్తిస్తుందని అన్నారు. అలాంటి జర్నలిస్టుల పై ఈ మధ్య కాలంలో దాడులు జరుగుతున్నాయని ఇలాంటి దాడులు పునరావృత్త కాకుండా ప్రభుత్వాలు చోరవ తీసుకుని జర్నలిస్టుల కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. విలేఖరుల పై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇలా ఎన్నో సమస్యల్లో ఉండే జర్నలిస్టులకు ప్రభుత్వాలు ఆదుకోవాలని విలేఖరుల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడాలని కోరుతూ ఏపీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ జర్నలిస్ట్ లకు అండగా ఉంటుందని ఈ సందర్భంగా యూనియన్ నాయకులు తెలిపారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

- బాణసంచా విక్రయించే తాత్కాలిక షాపులు శివార్లలోని బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలన్న జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్

- అగ్ని ప్రమాదాల నియంత్రణకు షాపు యజమానులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్న జిల్లా ఎస్పీ

- షాపుల వద్ద సమృద్ధిగా నీరు, పాడి ఇసుక, అగ్ని నియంత్రిక పరికరాలు అందుబాటులో ఉంచాలన్న జిల్లా ఎస్పీ

- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించిన జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



నేటి కాలం – విజయనగరం:
దీపావళి పండుగ వస్తున్న నేపథ్యంలో బాణసంచా ప్రేలుళ్ళు, ప్రమాదాలు జరగకుండా బాణసంచా నిల్వ ఉంచే గోడౌన్లు, విక్రయించే లైసెన్సు షాపులు, తాత్కాలిక బాణసంచా విక్రయ షాపుల వద్ద వ్యాపారులు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు, రక్షణ చర్యలు చేపట్టే విధంగా తనిఖీలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్న వంబరు 6న ఆదేశించారు.
జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – బాణసంచా విక్రయించేందుకు విక్రయదారులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుండి తాత్కాలిక అనుమతులు పొందాలన్నారు. తాత్కాలికంగా బాణసంచా విక్రయాలు చేపట్టే వ్యాపారులు తమ షాపులను నివాస ప్రాంతాలకు, ఆసుపత్రులకు దూరంగా ఉండే విధంగాను, పట్టణ, గ్రామ శివార్లలోని బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాల నియంత్రణకు షాపుల మధ్య తప్పనిసరిగా 15 మీటర్ల నిర్దిష్ట దూరం ఉండాలన్నారు.
అనుమతులు ఉన్న షాపుల నుండి మాత్రమే తాత్కాలిక లైసెన్సులు పొందిన విక్రయదారులు బాణసంచాను కొనుగోళ్ళు చేయాలన్నారు.షాపుల వద్ద ప్రమాదాల నియంత్రణకు ఇసుక బస్తాలు, నీటి టబ్బులు, ఫైర్ నియంత్రికలను అందుబాటులో ఉంచాలన్నారు. మతాబు షాపుల వద్ద ఎక్కువ మంది వ్యక్తులు గుంపులుగా ఉండి ఒకేసారి కొనుగోలు చేయకుండా చూసుకోవాలన్నారు. ప్రమాదాల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్ని ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న వస్తువులు, దగ్గరలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలు, హెచ్చరికలతో కూడిన బోర్డులను, ఫ్లెక్సీలను తాత్కాలిక షాపుల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. మనుష్యులు ప్రయాణించే వాహనాల్లో బాణసంచాను రవాణ చేయకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండే మెటీరియల్ మాత్రమే అనగా ఆస్బెస్టాస్, జి.ఎస్.రేకులతో తాత్కాలిక షాపులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బాణసంచా విక్రయాలు, నిల్వలు ఉంచే షాపులు, గోడౌన్లు వద్ద వెలుగు ఉండే విధంగాను, లోపలకు, బయటకు వెళ్ళేందుకు వేర్వేరు ద్వారాలు ఉండే విధంగా చూడాలన్నారు. గోడౌన్లులో సురక్షితమైన వైరింగు, ఫైర్ అలారమ్స్ ఉండే విధంగా షాపు యజమానులు చర్యలు చేపట్టే విధంగా చూడాలన్నారు.మతాబులు విక్రయించే షాపులు, నిల్వ ఉండే గోడౌన్లు, తాత్కాలిక షాపుల వద్ద ఫైర్ సేఫ్టీ ప్రికాషన్స్ అన్నింటిని తప్పని సరిగా పాటించాలని, లైసెన్సులో అధికారులు సూచించిన సమయం వరకు మాత్రమే విక్రయాలు నిర్వహించే విధంగా చూడాలన్నారు.బాణసంచా వ్యాపారుల తాత్కాలిక లైసెన్సుల గడువు ముగిసిన తరువాత మిగిలిన బాణసంచాను నిబంధన లకు అనుగుణంగా రూపొందించిన గోడౌన్స్ లోనే భద్రపర్చుకోవాలని, జనావాసాల్లోను, ఇండ్లలోను భద్రపర్చవద్దన్నారు.నిబంధనలు, భద్రత ప్రమాణాలను అతిక్రమించిన వారిపైన, జనావాసాల్లో బాణసంచాను భద్రపర్చిన వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు.

బాపట్ల ఎల్ఐసీ బ్రాంచిలో వైభవంగా లక్ష్మీ పూజలు

బాపట్ల ఎల్ఐసి లో మంచి వ్యాపారాభివృద్ధితో ప్రతి ఒక్కరికీ శుభం

కలగాలని ఆకాంక్షించిన బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ

బాపట్ల, నవంబర్ 6 :
ధనత్రయోదశి సందర్భంగా బాపట్ల ఎల్ఐసీ బ్రాంచిలో శుక్రవారం లక్ష్మీ పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ, బ్రాంచిలో మంచి వ్యాపారాభివృద్ధి సాధించడం ద్వారా ప్రతి ఏజెంట్ మిత్రుడికి, వారి కుటుంబాలకు శుభం కలగాలని ఆకాంక్షించారు.ఈ లక్ష్మీ పూజా కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఏజెంట్ మిత్రుడికి లక్ష్మీ రూపు అందజేయనున్నట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో అందరికీ ఐశ్వర్యం, ఆనందం, ఆరోగ్యం, వ్యాపారాభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు.

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో సామూహిక లక్ష్మి కుబేర వ్రతం



క,జగ్గయ్యపేట,నవంబర్ 6
జగ్గయ్యపేట పట్టణంలో ధన త్రయోదశి సందర్భంగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ స్టేట్ ఉపాధ్యక్షులు కాకరపర్తి సోమేశ్వరరావు జ్యోతి దంపతుల ఆధ్వర్యంలో సామూహిక లక్ష్మి కుబేర వ్రతాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు పూజలో పాల్గొన్నారు.పండితులు వేద మంత్రోచ్చారణ నడుమ వ్రతంలో పూజా విధానాన్ని పూర్తి చేసుకొని లక్ష్మి కుబేర ఆశీస్సులను భక్తులు అందుకున్నారు.ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ స్టేట్ ఉపాధ్యక్షులు కాకరపర్తి సోమేశ్వరరావు జ్యోతి దంపతులకు అభినందనలు తెలియజేశారు.

కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి విజేతలకు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే దామచర్ల

- సంతోషాన్ని వ్యక్తం చేసిన నూతన కార్పొరేటర్లు





ఒంగోలు, నవంబర్ 6:
ఒంగోలు నగర కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన,బిజెపి పార్టీల తరపున పోటీ చేసి విజయం సాధించిన కార్పొరేటర్ అభ్యర్థులు శు క్రవారం ఉదయం ఒంగోలు నగరంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.ఆయా డివిజన్లకు చెందిన పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఎమ్మెల్యేను కలిసిన విజేతలు ఎన్నికల్లో తమకు సహకరించి విజయానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలియ జేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు విజయం సాధించిన టీడీపీ, జనసేన కార్పొరేటర్లను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి, హృదయపూర్వక అభినందనలు తెలియ జేశారు. ఎన్నికల్లో విజయం సాధించడం బాధ్యతతో కూడుకున్న విషయమని, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన ప్రతి ఒక్కరూ తమ తమ డివిజన్లలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతూ డివిజన్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా పని చేయాలని తెలిపారు.పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వంపై అందులో తెలుగుదేశం, జనసేన పార్టీలపై ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీకి చెడ్డపేరు తీసుకురాకుండా మంచి పేరు,గుర్తింపు తీసుకురావాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు విజేతలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా పలువురు కూటమి నాయకులు ఎమ్మెల్యే జనార్దన్ తో పిచ్చాపాటిగా ముచ్చటించారు.

పరిషత్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



నేటి కాలం – విజయనగరం: జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల అనంతరం పోలైన బ్యాలెట్ పత్రాలను సంబంధిత స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచి, వాటి రక్షణకు జిల్లా పోలీసుశాఖ తరపున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు, ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న బ్యాలెట్ పత్రాల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి పోలీసు అధికారులకు భద్రతాపరమైన పలు కీలక ఆదేశాలను జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ జారీ చేశారు.

లి విజయనగరం సబ్ డివిజన్ పరిధిలోని లోని విజయనగరం జే ఎన్ టి యూ , జొన్నాడ – లెండి ఇంజనీరింగ్ కళాశాల, ఎస్.కోట – వరలక్ష్మి కళాశాల, బొబ్బిలి సబ్ డివిజన్ పరిధిలోని గజపతినగరం – ప్రభుత్వ కళాశాల, బొబ్బిలి – ప్రభాకర్ స్కూల్, చీపురుపల్లి సబ్ డివిజన్ పరిధిలోని గరివిడి – ఎస్ డి ఎస్ కళాశాల, రాజాం – డి ఏ వి స్కూలు వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతరం సీసీ కెమెరాల నిఘా పెట్టాలని, పోలీసు గస్తీ ముమ్మరం చేయాలని, స్ట్రాంగ్ రూముల వద్ద అధికారులు తరుచూ తనిఖీలు నిర్వహించాలన్నారు.స్ట్రాంగ్ రూముల వద్దకు అనధికార వ్యక్తులు ప్రవేశించకుండా కట్టుదిట్టమైన భద్రత, నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు.కౌంటింగ్ కేంద్రాల వద్ద చేపట్టే బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను సంబంధిత సబ్ డివిజన్ పోలీసు అధికారులు స్వయంగా పర్యవేక్షించాలన్నారు.కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు విధులకు నియమించిన పోలీసు అధికారులు, సిబ్బందికి నిర్వహించే విధులు, బాధ్యతలపై స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు.
కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేసి, అవసరమైన చోట అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలి.పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, బాడీ వోర్న్ కెమెరాలు, డ్రోన్లు తదితర నిఘా పరికరాలతో నిరంతరం నిఘా పెట్టాలని ఆదేశించారు.
కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో జరుగుతున్న పరిణామాలను నిరంతరం వీడియో, ఫొటోగ్రఫీ ద్వారా రికార్డు చేయాలి.అభ్యర్థులు, వారి అధీకృత కౌంటింగ్ ఏజెంట్లను, గుర్తింపు కార్డులు, తగిన ధృవీకరణ అనంతరం లోపలికి అనుమతించాలన్నారు.మొబైల్ ఫోన్లు, ఐప్యాడ్లు, ల్యాప్‌టాప్‌లు, ఆడియో లేదా వీడియో రికార్డింగ్ చేయగల ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కౌంటింగ్ హాలులోకి అనుమతించరాదు.కౌంటింగ్ ప్రక్రియ సమయంలో కేంద్రాల వెలుపల ఎటువంటి గుంపులుగా గుమిగూడడాన్ని అనుమతించరాదన్నారు. అదే విధంగా తాత్కాలిక నిర్మాణాలు, షామియానాలు, పందిళ్లు ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు.రాజకీయ పార్టీల మధ్య ఘర్షణలకు, శాంతిభద్రతల సమస్యలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కౌంటింగ్ అనంతరం ఫలితాలు ప్రకటించిన తరువాత కౌంటింగ్ కేంద్రాల ప్రాంగణంలో విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చడానికి ఎటువంటి అనుమతులు లేవన్నారు.చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసుశాఖ అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎవరూ ఉద్రిక్తతలకు, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడరాదని, గెలుపోటములను ప్రజాస్వామ్య స్ఫూర్తితో స్వీకరించాలని సూచించారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు పోలీసుశాఖకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ కోరారు.

Printed, Published and Owned by Ganagalla Ramarao Printed at Print Point, Kodiganti vari street, Vizianagaram Dist. Pin: 535002, A.P.
Published at Ganagalla Ramarao, Konada Village and post, Pusapatirega mandal, Vizianagaram Dist. Pin: 535213, A.P."Editor:
Ganagalla Ramarao, Cell: 9581347358 Email: ramaraoganagalla06@gmail.com,